## క్లుప్తంగా

### 15న అమ్మవారి చీరల వేలం

**చిత్తూరు రూరల్:** నగరంలోని గిరింపేటలో వెలసిన దుర్గాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లను వేలం వేయనున్నట్లు ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

### బీఎస్పీ పోస్టర్ ఆవిష్కరణ

**చిత్తూరు రూరల్:** నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బీఎస్పీ నేతలు భాస్కర్, ప్రభాకర్ పార్టీ పోస్టర్ ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో బరిలో దిగనున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటించారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### నేడు పెనుమూరులో విద్యుత్ అదాలత్

**చిత్తూరు కార్పొరేషన్:** వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం పెనుమూరులో విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ పద్మనాభపిళ్లై తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు రామ్మోహన్, అంజనీకుమార్ ఈశ్వరమ్మ పాల్గొంటారన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అదాలత్ జరుగుతుందని వివరించారు.

### బంగారుపాళెం తహసీల్దార్‌గా సుభద్రమ్మ



**బంగారుపాళెం:** మండల తహసీల్దార్‌గా సుభద్రమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా నంద్యాల జిల్లా చాగలమర్రి మండల నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు డీటీ అనిల్‌కుమార్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు

**వెదురుకుప్పం :** మండలంలోని చవటగుంటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. పీజీ, యూజీసీ నెట్, సెట్ విద్యార్హత ఉన్నవారు అర్హులని వెల్లడించారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని చెప్పారు. ఇతర వివరాలకు 6302500965, 9912868469 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

**తవణంపల్లె:** ఓటరు నమోదుపై స్వయం సహాయక సంఘ సభ్యులు మంగళవారం పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దిగువమాఘం, కొండ్రాజుకాలువ, మైనగుండ్లపల్లె, తవణంపల్లె గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

### పశు సంరక్షణపై అప్రమత్తం



పాడిరైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ

**గుడిపాల:** పాడి రైతులు పశు సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రవితేజ కోరారు. మంగళవారం బొమ్మసముద్రం దళితవాడలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులను ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వ్యాధులు వచ్చినా పశు వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒక్కసారి ఇన్సూరెన్స్ చేస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కిషోర్ పాల్గొన్నారు.

### మైలేరు..యువత జోరు



**బైరెడ్డిపల్లె:** మండలంలోని రామనపల్లెలో మంగళవారం వైభవంగా మైలేరు పండుగ నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా మైలేరు పండుగలో పాల్గొన్నారు.

# సంకీళ్లు



- పెరుగుతున్న ఆర్థరైటిస్ బాధితులు
- మారిన ఆహార అలవాట్లతోనే సమస్యలు
- అందుబాటులో వైద్య సేవలు
- సకాలంలో చికిత్సలందిస్తే ఇబ్బందులు తొలగుతాయంటున్న నిపుణులు

నిలబడలేరు.. కూర్చోలేరు.. సరిగ్గా నాలుగు అడుగులు నడవలేరు.. ఇక మెట్టు ఎక్కాలంటే అంతే సంగతులు.. పట్టేసిన మోకాళ్లు.. తీవ్రమైన కీళ్ల నొప్పులతో నిత్యం నానా పాట్లు పడుతుంటారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య ఇటీవల అనూహ్యంగా పెరుగుతోంది. మారిన జీవనశైలి కారణంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనే వ్యాధితో ఎక్కువమంది ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా నడి వయసు వారిలోనే బాధితులు అధికంగా ఉంటున్నారు. ఎముకలు.. కండరాలపై ఏకకాలంలో ప్రభావం చూపించే ఈ రోగంతో వచ్చే నొప్పిని భరించలేక విలవిలలాడుతున్నారు. సరైన ఆహారపు అలవాట్లను పాటిస్తే ఈ జబ్బు బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సకాలంలో చికిత్స చేయించుకుంటే వ్యాధిని నియంత్రించుకోవచ్చని వెల్లడిస్తున్నారు.

**చిత్తూరు రూరల్ :** జిల్లావ్యాప్తంగా ఆర్థరైటిస్ బాధితుల సంఖ్య క్రమేణా పెరుగుతోందని వైద్యులు తెలియజేస్తున్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఈ వ్యాధి పీడితులు అధికమవుతున్నారని వెల్లడిస్తున్నారు. దీని బారిన పడిన వారికి ముఖ్యంగా కీళ్లు పట్టేస్తాయి. నడిచేందుకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుంది. కూర్చుంటే కూడా భరించలేంత నొప్పి వేధిస్తుంది. కీళ్లతోపాటు ఎముకలు, కండరాలు, టిన్డాన్లు, లిగమెట్లపై ప్రభావం చూపించడంతో బాధితులు తీవ్రంగా ఇబ్బందిపడతారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

**కారణాలు ఇవీ..**

సాధారణంగా మనం తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాతే మళ్లీ భుజించాలి. కానీ అది జీర్ణం కాకముందే మళ్లీ..మళ్లీ ఆహారం తీసుకోవడం, సమయానికి తినకపోవడం వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. తిన్న ఆహారంసరిగ్గా జీర్ణం కాకపోవడంతో అది విషంగా మారి శరీరంలో వాతం కలిగిస్తుంది. అది ప్రకోపించి కీళ్లలో చేరి అక్కడ నొప్పి, వాపును కలగజేస్తోంది. దీన్ని ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌గా పిలుస్తారు. దీంతో మన శరీరంలోని రక్షణ వ్యవస్థ మనలకు కాపాడే సంగతి వదిలేసి, కణజాలాలు, కీళ్లపై దాడి చేసి అక్కడ నొప్పి, వాపు తీసుకువస్తుంది. దీంతోపాటు అంటువ్యాధులు, హార్మోన్లలో మార్పులు, మానసిక ఒత్తిడి, ధూమపానం, కాలుష్య కారకాల వల్ల కూడా కీళ్లవాతం వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి.

**నివారణ ఇలా..**

- మసాలా ఆహారానికి, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి
- అధికంగా మాంసాహారం, నిల్వ ఉంచిన ఆహారం తినకపోవడం మంచిది.
- మినుములతో చేసిన పదార్థాలు, జంక్ ఫుడ్ మానేయాలి
- చల్లటి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలి
- రాత్రివేళల్లో ఎక్కువ సేపు మేల్కొకూడదు
- తగినంత సమయంల నిద్రపోవాలి

**కొత్తగా బైలాజిక్ డ్రగ్స్**



కీళ్లవాతానికి పాతకాలం చికిత్సలో బాగంగా డిసీజ్ మాడిఫైడ్ యాంటీ రుమాటిక్ డ్రగ్స్ వాడతాం. రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధిని నియంత్రిస్తాం. ఇప్పుడు కొత్తగా బైలాజిక్ డ్రగ్స్ వచ్చాయి. ఇందులో రోగికి నొప్పి ఉన్న చోట ఇంజెక్షన్ ఇస్తాం. దీనిలో సైడ్ ఎఫెక్ట్స్ తక్కువ. అయితే ఈ మందులు ఖరీదైనవి. కీళ్ల వాతానికి ఇచ్చే మందులు నేరుగా ఇమ్యూన్ సిస్టమ్స్‌పై పనిచేస్తున్నాయి. కాబట్టి కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ రిస్క్ ఉంటుంది. ట్రీట్ టు టార్గెట్ విధానంలోనూ ఆధునిక పద్ధతిలో మందులున్నాయి. సకాలంలో చికిత్స చేయంచుకుంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది.
–డాక్టర్ అనిల్‌కుమార్ ఫిజియోథెరపిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

**మందులతో నియంత్రణ**



రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించి రెగ్యులర్‌గా మందులు వాడితే నియంత్రణలో ఉంచుకోవచ్చు. సక్రమంగా మందులు వాడకపోతే ఇతర అవయవాలకు నష్టం కలిగే అవకాశం ఉంది. సాధారణంగా పురుషుల కంటే స్త్రీలలోనే బాధితులు ఎక్కువ. ఏ వయసు వారికైనా ఈ వ్యాధి రావచ్చు. దీనికి వాడే మందులు రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపిస్తాయి. కాబట్టి కొందరిలో దుష్ప్రభావాలు రావచ్చు. వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలి. అలాగే ఆరోగ్య జీవన విధానం అలవరచుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. – లావణ్య, ఫిజియోథెరపిస్ట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

**ఆహార పద్ధతుల్లో మార్పు అవసరం**



స్వేదకర్మ లంఖనం, పాచనౌషధములు, రూక్షకరమైన ఆలేపణం, రూక్ష స్వేదము, సేకము మొదలైన చికిత్సా విధానాల ద్వారా కీళ్లవాతం నివారించవచ్చు. బాధితులు చల్లటి నీటితో స్నానం చేయకూడదు. గోరు వెచ్చని నీటినే తాగాలి. ముందుగా తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాతే మళ్లీ భుజించాలి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన పదార్థాలను తినకూడదు. ఆహారపు పద్ధతుల్లో మార్పు రావాలి. ఆయుర్వేద మందులతో ఈ వ్యాధిని నియంత్రణలోకి తీసుకురావచ్చు. పంచకర్మ, శమన తదితర చికిత్సల ద్వారా మంచి ఫలితం ఉంటుంది.
– శేఖర్‌రాజు, ఆయుర్వేద వైద్యుడు, చిత్తూరు

# బదిలీ కాని 'భవిష్య నిధి'

- యాక్సిస్ బ్యాంకులో చిక్కుకున్న జీపీఎఫ్ సొమ్ము
- 310 మంది ఉద్యోగులకు చెందిన రూ.కోటికి పైగా నగదు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు




**చిత్తూరు అర్బన్:** బ్యాంకు నుంచి మనం తీసుకున్న రుణం చెల్లించాల్సిన తేదీ కంటే ఒక్కరోజు ఆలస్యంగా కడితే నానా యాగీ చేస్తుంటారు. ముక్కుపిండి మరీ వసూలు చేసేస్తారు. అలాంటిది ఉద్యోగులకు రావాల్సిన నగదును మాత్రం ఎలాంటి కారణం లేకుండా బ్యాంకులోనే ఉంచేసుకున్నారు. వివరాలు.. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 310 మంది ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ నిధులపై ప్రస్తుతం అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులకు గ్రూప్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) నిధులు దాదాపు రూ.కోటికి పైగా నగరంలోని యాక్సిస్ బ్యాంకులో ఉండిపోయాయి. ఉద్యోగుల ఖాతాలను బ్యాంకు నుంచి రద్దు చేసినా నగదు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని ఉద్యోగుల పక్షాన నిలబడాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

**ఏంటీ వివాదం..?**

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బంది మొత్తం ఉద్యోగులకు ప్రతీ నెలా వారి మూల వేతనం నుంచి 10–14 శాతం చొప్పున జీపీఎఫ్‌ను రికవరీ చేస్తారు. ఈ మొత్తాన్ని 2013 నుంచి 2022 డిసెంబరు వరకు చిత్తూరులోని యాక్సిస్ బ్యాంకులో జమ చేస్తూ వచ్చారు. నెలకు సగటున రూ.5 లక్షల వరకు ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను బ్యాంకులో వేశారు. అయితే జీపీఎఫ్ నగదు తమ బ్యాంకులో ఉంచుకోవడం కుదరదంటూ 2022 డిసెంబరు తర్వాత యాక్సిస్ బ్యాంకు అధికారులు ఉద్యోగుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను బ్యాంకులో ఉంచుకున్నందుకు వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిన బ్యాంకు అధికారులు ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఒక్కో ఉద్యోగికి రూ.లక్షల్లో బకాయిలు రావాల్సి ఉంది. బ్యాంకు తమ సొమ్ము చెల్లించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

**పట్టించుకోరా..!**

ఈ వ్యవహారంపై కార్పొరేషన్ అధికారులు బ్యాంకు నిర్వాహకులకు ఓ లేఖ రాశారు. ఉద్యోగుల జీపీఎఫ్‌ను మరో బ్యాంకులో చెల్లించడానికి అందరి పేరిట ఖాతాలు కూడా తెరిపించారు. కానీ ఒక్క రూపాయి నూతన బ్యాంకు ఖాతాలో జమ చేయలేదు. యాక్సిస్ బ్యాంకు నుంచి రావాల్సిన నగదును తెప్పించడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలమైందనే చెప్పాలి. వాస్తవానికి నెలనెలా ఉద్యోగుల పేరిట చెల్లించిన జీపీఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించకపోతే బ్యాంకు నిర్వాహకులపై చీటింగ్ కేసు పెట్టడం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, సెబీకు రాత పూర్వక ఫిర్యాదు చేయడం జరగాలి. కానీ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. బ్యాంకు అధికారులతో ఏమైనా కుమ్మక్కయ్యారా..? అని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికీ రికవరీ చేస్తూనే..**

మరోవైపు యాక్సిస్ బ్యాంకు నుంచి జీపీఎఫ్ నిధులు తెప్పించలేకపోతున్న మున్సిపల్ అధికారులు ఇప్పటికీ తమ ఉద్యోగుల నుంచి నెలనెలా జీపీఎఫ్ రికవరీ చేస్తూనే ఉన్నారు. ఈ మొత్తాన్ని కొత్తగా ఓపెన్ చేసిన ఖాతాల్లో జమ చేయకుండా మున్సిపల్ ఖజానాలో జమ చేస్తున్నారు. రికవరీ చేసిన మొత్తం కార్పొరేషన్ ఖజానాలో ఉంచుకుంటే ఉద్యోగులకు వడ్డీ రాదు.. అదే బ్యాంకులో జమ చేస్తే కనీస వడ్డీ లభిస్తుందనే విషయాన్ని అధికారులు మరచిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. '' జీపీఎఫ్ నగదు ఇచ్చేయమని ఇప్పటికే బ్యాంకు అధికారులకు లెటర్ పెట్టాం. నేరుగా వెళ్లి మాట్లాడాం. కానీ వాళ్లు స్పందించడం లేదు. బ్యాంకు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి కమిషనర్‌తో మాట్లాడుతున్నాం..'' అని తెలిపారు.

## చీడపీడల నివారణతో నాణ్యమైన దిగుబడి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

**బంగారుపాళెం:** పంటల సాగులో చీడపీడలను నివారణతోనే నాణ్యమైన దిగుబడి వస్తుందని డీఆర్‌సీ ఏడీఏ శివశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని టేకుమంద, మొగిలివారిపల్లెలో రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో జింక్ లోపం అరికట్టేందుకు 2గ్రాముల చిలేట్‌జింక్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మిరపలో ఆకుముడుత నివారణకు డైమిథోయేట్ 2 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ 1.6 మి.లీని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ చిట్టిబాబు, విస్తరణాధికారులు సాదరయ్య, చంద్రిక పాల్గొన్నారు.

## 9న 'నులి' నివారణకు సన్నద్ధం



బంగారుపాళెం: మాట్లాడుతున్న డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్

**తవణంపల్లె :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీన 19 ఏళ్ల పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించాలని కోరారు. పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని స్పష్టం చేశారు. అనంతరం నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్ విష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీహరి, నిర్మల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

**చైతన్యవంతం చేయాలి**

**బంగారుపాళెం:** పిల్లల్లో నులిపురుగుల నివారణపై ప్రజలను చైతన్యవంతం చేయాలని వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఎప్పుడు వేయాలి, ఎలా వేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు లోకేష్, రమేష్, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు, డీపీఎంఓ మణి, సీహెచ్‌ఓ షమీమ్‌బేగం, సూపర్‌వైజర్లు హరికృష్ణ, అముద పాల్గొన్నారు.




తవణంపల్లె : మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రియాంక

**లక్ష్యం అధిగమించాలి**

**యాదమరి:** ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలని వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ ఆదేశించారు. మంగళవారం యాదమరి ప్రభుత్వాసుపత్రిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

### పూతలపట్టు ఎంపీడీఓగా ప్రసన్నకుమారి



**పూతలపట్టు:** ఎంపీడీఓగా ప్రసన్నకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు, నేతలు అభినందనలు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని వెల్లడించారు.

**యాదమరి ఎంపీడీఓగా సింగయ్య**

**యాదమరి:** ఎంపీడీఓగా సింగయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఈఓపీఆర్‌డీ హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



ఎంపీడీఓను సత్కరిస్తున్న సిబ్బంది

### తహసీల్దార్‌కు వీఆర్‌ఏల సత్కారం

**యాదమరి:** తహసీల్దార్ దైవాధీనాన్ని మండలంలోని వీఆర్‌ఏలు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు దేవరాజులు, చంద్రన్న, పరదేశి, చిట్టిబాబు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వీఆర్‌ఏలు

### నిరుద్యోగ ద్రోహి చంద్రబాబు

**పూతలపట్టు :** నిరుద్యోగులకు భృతి ఇస్తామని మోసం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అన్నీ విస్మరించారన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. యువత మరోసారి చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అందుకే జీడీ నెల్లూరులో టీడీపీ అధినేత నిర్వహించిన సభకు ప్రజలు ముఖం చాటేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

# సంపూర్ణ వైద్య సేవలకే 'సురక్ష'

**తవణంపల్లె :** పేదలకు సంపూర్ణ వైద్య సేవలను ఉచితంగా అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తవణంపల్లె మండల సచివాలయాల కన్వీనర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ రంజిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సి.హరిరెడ్డితో కలిసి హరికృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. వైద్య శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పురుషోత్తం, ఆర్థో స్పెషలిస్టు డాక్టర్ పవన్‌కల్యాణ్ సేవలందించారు. మొత్తం 312 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో చిన్నపిల్లలు 34 మంది, గైనకాలజిస్టు 26 మంది, 164 జనరల్ కేసులను మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేశారు.అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, రవిరెడ్డి, స్వరూప్ రెడ్డి, గోవర్ధన బేబీరెడ్డి, పాల్గొన్నారు.



తవణంపల్లె : ఆరోగ్య సురక్ష కిట్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం**

**ఐరాల:** ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కుసుకుమారి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లె సచివాలయ పరిధిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 207 మందికి స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు, హెల్త్ కార్డులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పూర్ణలత, శిరీష, శారద, పంచాయతీ కార్యదర్శి బేబీ, సీహెచ్‌ఓ సుగుణవతి, పీహెచ్‌ఎన్ జీవకళ పాల్గొన్నారు.

**ఇదో సువర్ణాధ్యాయం**

**గుడిపాల:** ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ సువర్ణధ్యాయమని ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాపసముద్రం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు మొత్తం 355 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్య, చంద్రమహేష్, గంగాధరం, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ఐరాల: మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



గుడిపాల : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు